



# మనం మారాలి - అవినీతి అంతం అవ్వాలి




ఒకరి నాయకత్వములో స్థాపించిన ఆసుపత్రి కాని, విద్యాలయాలు కాని బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. తమకు స్థోమత లేకున్న ప్రజలు ఎక్కువ మంది ప్రైవేటు సేవలకు మక్కువ చూపుతున్నారు. మరి మన ప్రభుత్వాల చేత ప్రజల కొరకు నెలకొల్పిన ఆసుపత్రులలో మందులు లేక, సరియైన వసతులు లేక ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే ప్రాణము పోయినంత పని అవుతుంది. పాఠశాలలో కళాశాలలో నాణ్యమైన బోధనలు లేక విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. మనకు ఇప్పటికి అర్థము కానిది ఏమిటంటే, ప్రభుత్వానికి ప్రైవేట్‌కు ఎందుకింత వ్యత్యాసము. దీనికి బాధ్యత ఎవరిది? మనము ఎన్నుకున్న నాయకులదా? మనము ఎంచుకున్న ప్రభుత్వ ఆధికారులదా? అయితే ప్రతి సంవత్సరము వీటి నిర్వహణ, అభివృద్ధి కొరకు కోట్లు కేటాయింపు జరుగుతుంది. అయినా ప్రజలకు ఆశించినంత ఫలితాలు రాకపోవడము, దానితో ప్రభుత్వాలపై నమ్మకము సన్నగిల్లుతుంది. ప్రతిపక్షాలు దీనిని ఆసరాగ తీసుకొని ఆందోళనలు నిరసనలు చేపట్టి అతికష్టంగా కొత్త వాగ్దానాలతో అధికారములోకి వస్తారు. అయినా మళ్ళీ అదే



తంతు నాయకుల అవినీతి ఆరోపణలు, అధికారుల అలసత్వము, మార్పు కనబడని ఆసుపత్రుల, పాఠశాలల నిర్వహణ, అలా 74 సంవత్సరాల నుండి ప్రజలు ఎవరో ఏదో చేస్తారని ఎదురు చూస్తునేవున్నారు. మన దేశ అభివృద్ధి కుంటుపడటానికి, ప్రజలకు ప్రభుత్వ సేవలలో అలసత్వానికి గల కారణము ఎవరంటారు. ఇప్పటికి అర్థము కానిది, ఎన్నటికి అర్థము కాని ప్రశ్న?


కొందరంటారు అధిక జనాభా అని, పేదరికమని, మరి కొందరంటారు నిరక్షరాస్యతని, వ్యవసాయ ఆధారిత దేశమని, ఇలా చర్చ మొదలై పరిష్కార మార్గాన్ని అన్వేశించిన, అమలు పర్చడములో విఫలం అవుతున్నాము. పూర్వము రాజుల కొలువులలో మంత్రులు తెలివి తేటలతో వుండి, ప్రజల యోగ క్షేమాల గురించి ఆలోచించేవారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో గాంధీజీ, నెహ్రూ, అంబేద్కర్, పటేల్ లాంటి మొదలగు నాయకుల సుధీర్ఘ పోరాటముతో పాటు మేధోమదనము జరగడము వలనే స్వాతంత్ర్యము సిద్ధించిందని చెప్పుకోవచ్చును. కారణాలు ఏమైనప్పటికి స్వాతంత్ర్యము అనంతరము మేధావులు, విద్యావంతులు, రాజకీయాలకు దూరంగా వుండటము జరిగింది. దానితో రాను రాను స్వార్థపూరిత, అధికార దాహమున్న, నేర చరితులు, గుండాలు ఎక్కువ శాతము మంది రాజకీయాల్లోకి ప్రవేశించడముతో, సేవా దృక్పదమున్న నాయకులు శాశ్వతంగా దూరమవ్వడముతో, శాసన వ్యవస్థ బలహీనపడింది. నేటి నాయకుడు ప్రజల సమస్యలను పక్కన బెట్టి సేవలను మరిచి, అనుచరులను వెంట బెట్టుకొని, తన కమీషన్ల వసూళ్లకై ఎక్కువ సమయాన్నివెచ్చిస్తున్నాడు. తనను ప్రజలు ఎందుకు ఎన్నుకున్నారు? నా పాత్ర ఏమిటి ? నేను ఏ విధంగా ప్రజలకు సేవలు అందించగలుగుతాను? నాటి పరిస్థితులకు అనుగుణంగా నూతనంగా శాసనాలు చేయడం అవసరమా ? ప్రస్తుతాన్ని మరిచి రాబోయే ఎన్నికల గురించి ఎక్కువ ఆలోచనలు చేస్తున్నారు. కొంతమంది నాయకులు. తన కార్యకర్తలకు మాత్రమే పని చేస్తారు. తన నియోజక వర్గములో మిగత వారిని శత్రువుగా పరిగణిస్తారు. అవతలి వర్గము వారు, ఇవతలి వర్గము వారిపై కన్నెర్ర చేయడము. ఈ యుద్ధాల మధ్య సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు సరైన రీతిలో చేరక ఇబ్బంది పడుతుంటారు.


మనిషి తన వ్యక్తిగత జీవితములో ఏదైన తప్పు చేస్తే తాను ఒక్కడే బాధను భరించాలి. ప్రజా జీవితములో తప్పులు చేస్తే అతన్ని ఎన్నుకున్న ప్రజలు బాధను భరించాలి. అందుకే మన నాయకుని ఎన్నుకునే ముందు బాగా ఆలోచించాలి. నాగరిక ప్రపంచములో, ఏ నాయకుడైన నిజాయితీతో, ప్రజల భాగస్వామ్యంతో, జవాబుదారి తనముతో,



పరిపాలన సాగిస్తే అతను ప్రజల హృదయాల్లో మెలుగుతాడు. ఆది మానవుని కాలం నుండి ఆధునిక మానవుడిగా రూపాంతరము చెంది అవాసాలు నిర్మించుకొని, ఒక నాగరిక ప్రపంచాన్ని సృష్టించుకొని, ప్రాంతాలుగా, దేశాలుగా ఏర్పడి, రక్షణ వలయాలు నిర్మించుకొని, ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొని, చట్టాలను తయారుచేసుకొని, మనిషిగా జీవిద్దామని ఆటవిక నాగరికతకు స్వస్తి చెప్పాము. మన మూలాలను తెలుసుకున్న మనము, మన మనగడకు నిర్మించుకున్న ప్రభుత్వాలు, రాసుకున్న రాజ్యాంగము తయారు చేయబడిన చట్టాలను నిజాయితీగా అమలు పరిచినప్పుడే నిజమైన అభివఅద్ధి సాధించుకుంటాము. ప్రజల జీవితాలు ప్రభుత్వముతో నిత్యము, నిరంతరము ముడిపడివున్నాయి. మన పాలన వ్యవస్థలో భాగమైన కొంతమంది అధికారులు ప్రతి చిన్న విషయాలను భూతద్దములో చూయించి ప్రజల సేవలకు అడ్డుపడు తుంటారు. మరికొంతమంది అధికారులు ఆశ్రితపక్షపాతము, తాత్సరము అలసత్వమునకు కారకులై ప్రజల జీవితాలతో ఆడుకుంటారు. ప్రతి నెల జీతభత్యాలు పొందుతూనే, కొందరు ప్రజలను పీడించి, అవినీతికి పాల్పడి, సొమ్మును పోగు చేసుకుంటారు, పైగా తాము చేసేది తప్పుకాదని వాదనకు దిగుతారు. ప్రభుత్వములో ఉద్యోగమును సాధించి, జవాబుదారీగా వుంటూ, ఎటువంటి అవినీతికి, అక్రమాలకు పాల్పడకుండా వుంటే రిటైర్మెంటుకు ముందు, రిటైర్మెంటుకు తర్వాత కూడ సాఫీగా, నిర్భయముగా జీవించవచ్చును. ప్రతి రోజు ఎంతో కొంత లంచము తీసుకొంటు, భయముతో బ్రతుకుతూ, సమాజానికి తప్పుడు సంకేతాలను పంపుతూ విషవలయములో చిక్కుకొంటు తొందరగా తనువు చాలిస్తున్నారు. కొంతమంది ఉద్యోగుల అనధికార ఆస్తులను చూసి అవినీతి నిరోధక శాఖ అధికారులు సైతము ఖంగుతింటున్నారు. మన సమాజములో వున్న దురాచారాలను సతిసహగమనము, బాల్య వివాహాలను, అంటరానితనమును, బాలకార్మికుల నిర్మూలన వంటి సాంఘిక రుగ్మతలను రూపుమాపు కొన్నాము. ప్రభుత్వములో అవినీతిని కూడ రూపుమాపడము సాధ్యపడదా? మన ప్రజాస్వామ్య పాలనలో ఖచ్చితంగా సాధ్యపడుతుంది. ఎటువంటి ప్రలోభాలకు లోబడకుండా మన ఓటు ద్వార మంచి నాయకత్వాన్ని బలపరచాలి.

అయితే మనము మూలాలకు వెళ్ళకుండా, శాశ్వత పరిష్కారానికై, ఆలోచించకుండా, తలనొప్పి వచ్చినప్పుడల్ల నొప్పి మాత్రలను మింగి ఉపశమనాన్ని పొందినట్లౌవుతుంది. కాస్త ప్రశాంతంగా మన తలనొప్పికి కారణాన్ని ఆలోచిస్తే, మనకు పరిష్కారము దొరుకు





తుంది. సరైన నిద్ర లేకపోవడము, శరీరానికి సరిపోవు నీరు త్రాగపోవడము, భోజనము వేళకు తినకపోవడము, కంటి చూపు మందగించడము, ఆందోళన, వత్తిడి, విశ్రాంతి తీసుకోపోవడము వంటివి తలనొప్పికి కారణాలు. కాస్త సమయం తీసుకొని మానసిక, శారీరక వ్యాయామం వలన శాశ్వతంగా తలనొప్పికి పరిష్కారం కనుగొన వచ్చును. మన శరీరాన్ని అర్థము చేసుకొని తలనొప్పిని శాశ్వతంగా పరిష్కారం చేసి నట్లుగానే, సమాజములో ప్రజలు ప్రశాంతంగా జీవించడానికి మనము నిర్మించుకున్న ప్రభుత్వాలని ప్రశ్నించలేమా? ప్రస్తుత పాలనతో విరక్తి చెందుతున్నప్పుడు మనము పాలకులను ప్రశ్నించడానికి వెనుకాడవద్దు. మన దేశము నైసర్గికంగా మూడువైపుల నీరు, మరో వైపు ఉత్తరాన హిమాలయా పర్వతాలు వున్నాయి. ప్రపంచములో ప్రతియేట కొన్ని దీవులు, దేశాలు, భూకంపాల, తుఫానుల బారిన పడుతుంటాయి. ప్రాణ నష్టం కాకుండా ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా వుంటూ, ఐకమత్యముతో వుండి మళ్ళీ అభివృద్ధి దిశలో ప్రయాణం కొనసాగి స్తున్నారు. శత్రు దేశాల దాడి ప్రకృతి వైపరీత్యాలైన భూకంపాలు, తూఫానుల వంటి తాకిడి ఇతరదేశాలతో పోల్చితే మనము చాలా అదృష్టవంతులము. మనకిక్కడ సమశీతోష్ణ స్తితి కూడ ఒక వరము. ఈ భయాలు లేవు కనుక మనిషి అదుపుతప్పుతాడని, మన భారతీయుల జీవనశైలికి, సమైక్యత, సౌభ్రాతృత్వము కొరకు స్వీయ నియంత్రణ అవసరమని శాస్త్రాలు తెలియపరుస్తున్నాయి. పూర్వీకులు, ఋషులు, యోగులు ధ్యానము ద్వార మనసును నియంత్రణలో వుంచుకుని, క్రమశిక్షణతో మెలిగేవారు. సామాన్య ప్రజలు వారిని ఆదర్శంగా తీసుకొని భయ, భక్తులతో జీవనము గడిపేవారు. వరుస యుద్ధాలు రాజ్యాల ఆక్రమణలు, పరాయిపాలన మధ్య కొంత భయముతోనే బ్రతికినారు. బానిస బతుకుల నుండి విముక్తి, స్వేచ్ఛ కొరకు సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాటము చేసి, ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యము సిద్ధించినది.





స్వాతంత్ర్యానంతరము మనిషికి బానిస బతుకుల నుండి దూరమై, స్వేచ్ఛ పెరిగింది. ఈ స్వేచ్ఛ మనలో కొంతమందిని సోమరితనానికి, విపరీత దోరణికి దారి తీసింది. మన రాజ్యాంగ హక్కుల గురించి మాట్లాడే వారు ఎక్కువైనారు, వారి భాధ్యతలను విస్మరిస్తున్నారు. మనది అతిపెద్ద లిఖిత రాజ్యాంగమైనప్పటికి, దానిని అనుసరించ డములో వెనుకబడ్డామని చెప్పవచ్చును. మన న్యాయ వ్యవస్థ ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించకపోవడము ఒక కారణము. ప్రజాస్వామ్యములో నాల్గవ స్తంభము అయిన మన మీడియా కూడ తన కర్తవ్యాన్ని నెరవేర్చలేక పోయింది. మన రాజ్యాంగ పరిరక్షణలో భాగమైన "దుష్టశిక్షణ శిష్టరక్షణ" ను మరిచి కొన్ని రాజకీయ పార్టీలకు కర పత్రాలుగా మారినాయి. ఈరోజు సేవా దృక్పదమున్న వారు రాజకీయాల్లోకి రావాలంటే భయపడుతున్నారు. నేటి మీడియా వైఖరి మాదిరిగానే 1947 కంటే ముందు వుంటే ఇంకా మనము స్వాతంత్ర్యము రాని దేశము జాబితాలోనే వుండేవాళ్ళము మన అఖండ భారత్ విభిన్న మతాలకు, విభిన్న కులాలకు నిలయము. ఒక్కొక్కరికి ఒక ఆచారము, భిన్నమైన సంస్కృతులు, వేరు వేరు యాసలు, భాషలు వీటన్నింటిని కాపాడుకోవలసిన అవసరము ప్రతి పౌరుడి భాధ్యత. దేశభక్తి, సమైక్యత సౌభ్రాతృత్వము, సామరస్యము జాతీయ భావము అలవరుచుకోవాలి. మనకు స్వాతంత్ర్యము సిద్ధించి 74 సంవత్సరాలు గడిచింది. ఈనాటికి, కోట్లాది మంది భారతీయులు సరైన కూడు, గుడ్డ లేక నాణ్యమైన విద్య, వైద్యము అందక జీవిస్తున్నారు. ఇతర దేశాల పాఠ్యపుస్తకాలలో మన దేశము పేద దేశము క్రిందనే అచ్చు జరుగుతుంది. మన తర్వాత స్వాతంత్ర్యం సాధించిన దేశాలు బాగా అభివఅద్ధి సాధించాయి. కొన్ని సంస్థలు చేసిన మార్గదర్శకాల ప్రకారము, మనదేశం అభివృద్ధి చెందిన జాబితాలో వుండాలంటే, వ్యవసాయముతో పాటు పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వము పెద్దయెత్తున యువతకు చేయూతనివ్వాలి. ప్రభుత్వ పనులను నిర్మాణ రంగసంస్థలకు అప్పగించడములో నిజాయితీగా వ్యవహరించాలి. ప్రభుత్వము ప్రజాపంపిణి అమలుపరిచే విధానములో జవాబుదారీ తనముతో మెలగాలి. ప్రభుత్వములో అవినీతిని కూకటివేళ్ళతో నిర్మూలించాలి. జర్మన్ దేశానికి చెందిన ట్రాన్స్పరెన్సి ఇంటర్నేషనల్ సంస్థ సర్వే ఆధారంగా, కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్సు 2020 ప్రకారము 180 దేశాలను సర్వే చేయగా అవినీతిలో 86వ స్థానము భారత్‌కు చేకూరింది. మనకంటే అవినీతిలో తక్కువ ర్యాంకింగ్లో 85 దేశాలున్నాయి. సింగపూర్, అమెరికా తక్కువ అవినీతి దేశాలుగా, బంగ్లాదేశ్, వెనిజుల ఎక్కువ అవినీతి దేశాలుగా నిలిచాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కరప్షన్ ఉద్దేశించి కరప్షన్ ఒక క్యాన్సర్ లాంటిదని ప్రజలకు ప్రజాస్వామ్యము మీద నమ్మకము హరిస్తుందని, సృజనాత్మక, అవిష్కరణ స్వభావాన్ని దహించివేస్తుందని వాఖ్యనించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకై విద్యావంతులు, మేధావులు,యువత మంచి మనస్సుతో ప్రజాసేవకై ముందుకు రావాలి, భావి తరాలకు మార్గదర్శకులవ్వాలి.



***– సోమ శ్రీనివాస్ రెడ్డి , వ్యవస్థాపకులు,***
***సర్వేజన సుఖినోభవంతు ఫౌండేషన్,***
***హైదరాబాద్***